క్రీడలతో మానసికోల్లాసం




మాట్లాడుతున్న డీఐజీలు సైదిరెడ్డి, ట్వింకిల్‌జాన్ తదితరులు, క్రీడల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

అబిడ్స్: ప్రతిరోజూ ఎంతో బిజీగా ఉండే ఉద్యోగులు మానసికోల్లాసంగా ఉండేందుకు క్రీడలు దోహదపడుతాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నోడల్ డీఐజీలు సైదిరెడ్డి, ట్వింకిల్‌జాన్ పేర్కొన్నారు. హైదరాబాద్ టీఎన్జీఓ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో కొనసాగిన జిల్లా ఉద్యోగుల ఆటల పోటీలు గురువారంతో ముగిశాయి. యెట్టం సదానంద్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కమర్షల్ ట్యాక్స్ క్రీడాకారులపై రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులు విజయం సాధించారు. ఎల్‌బీస్టేడియంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న సైదిరెడ్డి, ట్వింకిల్ జాన్ మాట్లాడుతూ..ఉద్యోగుల కోసం టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ప్రతి సంవత్సరం ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు అండగా ఉండి వారి ప్రగతికి, వారి సంసక్షేమానికి కృషి చేస్తానన్నారు. డీఐజీలు సైదిరెడ్డి, ట్వింకిల్ జాన్, హైదరాబాద్ సౌత్ డిస్ట్రిక్ రిజిస్ట్రార్ డీవీ.ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్, వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ రెడ్డి, కార్యదర్శి రహ్మత్ అలీ, సెక్రెటరేట్ సెక్షన్ అధికారి రంజిత్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా నాయకులు విక్రమ్‌కుమార్, కేఆర్.రాజ్‌కుమార్, వరదరాజు, ఉమార్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, సుజాత, గీత, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, శ్రీధర్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలను కల్పించాలి

ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. గురువారం ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురుశెట్టిని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కార్వాన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. పేద, బడుగు వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతారని వెంటనే కార్వాన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలలే పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని ఈ సారి అలా కాకుండా కార్వాన్ నియోజకవర్గంలో పదవ తరగతి టాపర్స్‌గా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉండేలా చూడాలని ఆయన కోరారు. జీవో 118 క్రమబద్ధీకరణపై కూడా గోల్కొండ, షేక్‌పేట్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్‌లతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీని కోసం తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించాలని ఆయన కోరారు. అంగన్‌వాడీలకు సరఫరా అవుతున్న పౌష్టికాహారం పైన కూడా సరైన పర్యవేక్షణ ఉండేలా చూడాలని ఆయన కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న భవనాల అద్దె బకాయిలు పెరిగిపోతున్నాయని వాటిని వెంటనే విడుదల చేసి యజమానులకు చెల్లించాలని ఆయన కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నిర్దేశించిన మొత్తంలో పౌష్టికాహారం అందిస్తేనే తమ చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. కాగా ఈ విషయాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

అభివృద్ధి పనుల్లో అవినీతి చోటు చేసుకుంటే సహించేది లేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ, నానల్‌నగర్ తదితర డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అహ్మద్ కాలనీ, మోతీదర్వాజా, కంపెనీబాగ్, ఎండీ లైన్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. అహ్మద్ కాలనీలో పూర్తయిన సీసీ రోడ్డును ఆయన పరిశీలించి దాన్ని నాణ్యతపై బల్దియా అధికారులతో మాట్లాడారు. మజ్లిస్ నాయకులతో పాటు డిప్యూటీ ఈఈ రామకృష్ణ తదితరులున్నారు.

మార్వాడీ గేవరి స్వీట్లు రెడీ



గేవరి స్వీట్లు తయారు చేస్తున్న దృశ్యం



తొమ్మిది రకాల మిఠాయిలతో గేవరి చూపిస్తున్న నితిన్

జియాగూడ: నగరంలో మార్వాడీ, గుజరాతీ, రాజస్థానీలు వందేళ్ల క్రితమే స్థిరపడ్డారు. వారితో పాటు నిర్వహించే పండుగలు మిఠాయిలు ముఖ్యంగా పండుగల సందర్భంలో ఎంతో ఆదరణకు చురగొంటున్నాయి. ముఖ్యంగా సంక్రాంతి పండుగ సంబరాల్లో మార్వాడీ గేవరి మిఠాయిలకు ఎక్కడలేని ఆదరణ లభిస్తుంది. కేవలం సంక్రాంతి పండుగ సమయాల్లో మాత్రమే లభించే ఈ స్వీటు తయారి విధానం మైదా, చక్కెర, నెయ్యి, మలాయి, వెన్న, డ్రై ఫ్రూట్స్ తదితర వాటితో తయారు చేస్తారు. వీటితో పాటు మరిన్ని రకాల మిఠాయిలు తయారు అవుతున్నప్పటికి మార్వాడీ గేవరి రుచి తియ్యదనం ముందు అవి బలాదూర్ గేవరీలు రూ.500 కిలో చొప్పున, డ్రై ఫ్రూట్స్ గేవరీలు రూ.600, తొమ్మిది రకాల మిఠాయిల కిట్ల ధరలు రూ.800, రూ.900 చొప్పున కేజీలలో లభిస్తాయి. ముఖ్యంగా ఇవి ఉత్తర భారతీయులు నివసించే మంగళ్‌హాట్ బేగంబజార్, జీన్సీ చౌరాయి, ఛత్రి, చుడిబజార్, మహేశ్వరీ భవన్, ముస్లిం జంగ్‌పూల్, సిద్దిఅంబర్‌బజార్ తదితర ప్రాంతాల్లో విక్రయాలు జరుగుతున్నాయి. గేవరిలు కొనేందుకు నగరంలోని పలు ప్రాంతాల్లో స్థిరపడిన ఉత్తర భారతీయులు ఈ ప్రాంతాలకు వచ్చి కొనుగోళ్లు చేయాల్సిందే.

ఘనంగా సంక్రాంతి సంబురాలు



విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో..



ఐ.ఎస్.సదన్ రవీంద్రభారతి పాఠశాలలో..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధాన ద్వారం ముందు రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా భోగిమంటలు వేశారు. చిన్నారులు హరిదాసుల వేషధారణలో వచ్చి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాధారణలో వచ్చి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ నౌషీర్‌ఖాతూన్, ఆర్ఐ.నవీన్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్రభారతి పాఠశాలలో..

సంతోష్‌నగర్: ఐ.ఎస్.సదన్ రవీంద్రభారతి పాఠశాలలో గురువారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు డీన్ జ్యోతి, ప్రధానోపాధ్యాయులు కె.పరిమళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు, నృత్య కార్యక్రమాలతో వైభవంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంక్రాంతి గొప్పదనాన్ని జ్యోతి, ప్రిన్సిపాల్ వివరించారు.



గుడిమల్కాపూర్‌లోని నారాయణ స్కూల్‌లో..

గుడిమల్కాపూర్ నారాయణలో..

సాక్షి, సిటీబ్యూరో: గుడిమల్కాపూర్‌లోని నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానా మొబిన్ సంక్రాంతి పండగ విశిష్టతను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి సందడి చేశారు.

ముగ్గుల పోటీలు



బహదూర్‌పురా: సాలార్‌జంగ్ మ్యూజియంలో రంగోళి పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. మహిళలు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొని అందమైన ముగ్గులను వేసి పలువురిని ఆకట్టుకున్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం మహిళా ఉద్యోగులు, మ్యూజియం క్వార్టర్స్‌లో నివాసముంటున్న మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మ్యూజియం పరిసరాలన్నీ రంగు రంగుల ముగ్గులతో కనిపించాయి. ఈ కార్యక్రమంలో మ్యూజియం డైరెక్టర్, బీఆర్ నాయక్, పి.నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చాక్‌పీస్‌లతో రామమందిరం !

వారం రోజుల్లో నిర్మాణం



సంపత్‌కుమార్



చార్మినార్: ఈనెల 22న అయోధ్య రామమందిర నిర్మాణం, బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా పాతబస్తీకి చెందిన సూరం సంపత్ కుమార్ వంద చాక్‌పీస్‌లతో 8.2 సెంటీ మీటర్ల ఎత్తు, 15.8 సెంటీ మీటర్ల వెడల్పుతో అందమైన అయోధ్య రామమందిరాన్ని నిర్మించారు. ఈ మందిర నిర్మాణం కోసం ఆయన వారం రోజులపాటు శ్రమించారు. ఆలయ నిర్మాణానికి 100 చాక్‌పీస్‌లను వినియోగించారు. రామమందిరాన్ని తీర్చిదిద్దడానికి సర్జికల్ బ్లేడ్, నీడిల్‌లను వినియోగించారు. ఫైన్ ఆర్ట్స్‌లో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న సంపత్‌కుమార్ ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారు. 2020 జులైలో ట్రిడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ అంతర్జాతీయ రికార్డు, 2020 సెప్టెంబర్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్, 2021 జనవరిలో బ్రేవో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ రికార్డులను సాధించారు. ప్రస్తుతం రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా 100 చాక్‌పీస్‌లతో రూపొందించిన రామమందిర నిర్మాణం ఆకట్టుకుంటోంది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కే.వి తారకరామా విద్యుత్ ఫీడర్ పరిధిలోని సంగీత కళాశాల, సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, చర్చ్ బిల్డింగ్, భాగ్యలక్ష్మి అపార్ట్‌మెంట్, రామ్‌కోఠి గణేష్ ఆలయం, గీతాంజలి, పిస్తాహౌస్, తిలక్ రోడ్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. 11 కే.వి రామ్‌కోఠి విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఏసీపీ కార్యాలయం, బాలాజి దాబా, శంషీర్‌బాగ్, కాచిగూడ బిగ్‌బజార్, తారకరామ థియేటర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



గోల్కొండ: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం ఆర్థిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా ముందుకు సాగుతుందని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఇన్‌చార్జి టి.వినేష్‌సింగ్ అన్నారు. గురువారం ఆయన గోల్కొంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కేలండర్‌ను బీజేపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రతినిధి కట్టా నర్సింగ్ రావు, బి.శ్రీకాంత్‌చారి ఉన్నారు.

పేదలకు చేయూతనివ్వాలి



చార్మినార్: పేదలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కుంభమేళా అగర్వాల్, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. కుంభ మేళా అగర్వాల్, అశోక్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో గురువారం అమావాస్యను పురస్కరించుకుని రికాబ్‌గంజ్‌లో ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

బహదూర్‌పురా: తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు తనపై చెడు ప్రచారం చేస్తున్న ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా జహనుమా తీగలకుంటకు చెందిన షేక్ అఫ్రోజ్ అలియాస్ రాబర్ట్ (45) ఆటో నడుపుతూ పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. షేక్ అఫ్రోజ్, ఫలక్‌నుమా వట్టిపల్లి ఫాతిమానగర్‌కు చెందిన షేక్ మహమూద్ అలియాస్ డబ్లా (40) వద్ద రూ.3 వేలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో మహమూద్ అఫ్రోజ్ ఇంటికెళ్లి అతని భార్య ముందు తిట్టి డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. డబ్బులు ఇవ్వకపోగా అఫ్రోజ్, మహమూద్‌పై చెడుగా ప్రచారం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న షేక్ మహమూద్ అఫ్రోజ్‌ను హత్య చేయాలని నిర్ణయించుకుని తన స్నేహితుడైన మహ్మద్ వసీం (22)తో చర్చించి తనకు సహకరిస్తే డబ్బులు ఇస్తానని ఒప్పించాడు. ఈ నెల 6న రాత్రి 10 గంటలకు ముర్గీచౌక్ ప్రాంతంలో కత్తిని కొనుగోలు చేసి ఆటోలో లిమ్రా మెడికల్ హాల్ ఎదురుగా ఉన్న ఓల్డ్ ఫర్నీచర్ షాపు వద్దకు వచ్చారు. అనంతరం షేక్ అఫ్రోజ్ తన స్కూటీపై అక్కడికి చేరుకోగానే మహమూద్, మహ్మద్ వసీం అడ్డుపడి కత్తితో పొడిచి హత్య చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులిద్దరిని గురువారం రిమాండ్‌కు తరలించారు.

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం

అఫ్జల్‌గంజ్: మహిళలు ఆర్థిక స్వావలంబన చెందాలనే ఉద్దేశ్యంతో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు సత్య సాయి సేవా సంస్థలు, కోఠి సమితి కన్వీనర్ పి. విశ్వేశ్వర శాస్త్రి తెలిపారు. గురువారం తోప్‌ఖానాలోని సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఇప్పటి వరకు 19 బ్యాచ్‌ల ద్వారా దాదాపు 700 మంది ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామన్నారు. 20వ బ్యాచ్‌ను ఈ 16న ప్రారంభించి 100 రోజులు లేదా 3 నెలల పాటు కొనసాగిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు తోప్‌ఖానాలోని సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో లేదా 88865 09410, 94404 09410 లల్లో సంప్రదించాలని సూచించారు.

అన్ని వర్గాల వారికి మోదీ సంక్షేమ పథకాలు



గోల్కొండ కోట వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం

గోల్కొండ: అన్ని వర్గాల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఇన్‌చార్జి టి.వినేష్‌సింగ్ అన్నారు. గురువారం గోల్కొండ కోట బస్టాప్ వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కోసం, మహిళలకు ఆర్థిక స్వావలంభన చేకూర్చడానికి ప్రధాని మోదీ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో ప్రవేశపెట్టబడుతున్న ఈ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడానికే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఇందులో భాగంగా ప్రజలకు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. వికసిత్ భారత్ సంక్పయాత్ర క్యాంప్‌లోనే ఆధార్ కార్డులో సవరణలు కూడా చేయిస్తున్నామని ఆయన అన్నారు. కట్టా నర్సింగ్ రావు, బి.శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

నాంపల్లి: అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం వేడుకలు గురువారం పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు లలిత కళా తోరణం ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. పాఠశాల వ్యవస్థాపక ఉపాధ్యక్షులు పీఎల్. శ్రీనివాస్, చైర్మన్ కొమురయ్య, అకాడమిక్ డైరెక్టర్ సుశీల్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. వేదిక్ విష్టా శీర్షికన విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ బాలకృష్ణ, ప్రిన్సిపల్ వనజ, వైస్ ప్రిన్సిపల్ రచన పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్ని ఏర్పాట్లు చేయాలి



అయ్యప్ప భక్తులతో వనమాల గోపాల్ గురుస్వామి తదితరులు

అబిడ్స్: శబరిమలలో అయ్యప్ప భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని గోల్కొండ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు, వనమాల గోపాల్ గురుస్వామి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేరళ ప్రభుత్వంతో మాట్లాడి అయ్యప్ప స్వాములకు సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. శంకర్‌బాగ్ ఆలయంలో అయ్యప్ప భక్తులు పూజలు నిర్వహించి ఇరుముడిలతో శబరిమలై తరలివెళ్లారు. ఈ సందర్భంగా వనమాల గోపాల్ గురుస్వామి మాట్లాడుతూ..కేరళ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంన్నారు. పి.నరేందర్ యాదవ్, జి.మణియాదవ్ కన్నెస్వామి, శ్రీనివాస్ గురుస్వామి, పి.గణేష్ యాదవ్, మనోజ్ యాదవ్, కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

జానపదానికి తగిన గుర్తింపు రావాలి



గాయనీమణి వేదవతి ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న దీపికారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: జానపదానికి తగిన గుర్తింపు రావాలని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గీతాంజలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీనటి అస్మాన అనసూయ జీవిత స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనసూయమ్మ తాను జీవించినంత కాలం జానపద గీతాలను అవలోకగా ఆలపించేవారని గుర్తు చేశారు. అనంతరం ప్రముఖ గాయనీలను వేదవతి ప్రభాకర్‌రావు, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత రత్నపాప, ఫిల్మ్ మేకర్ సీతా రత్నాకర్‌లను ఘనంగా సన్మానించారు. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సంగీత నాటక అకాడమీ పూర్వ అధ్యక్షుడు, నృత్య గురువు దీపికారెడ్డి ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పాతబస్తీలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి



దీపా దాస్ మున్షీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీని చార్మినార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పాతబస్తీలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తామంతా కృషి చేస్తున్నామనే విషయాన్ని నూతన ఇన్‌చార్జికి వివరించామన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



అంజమ్మ (ఫైల్)

సంతోష్‌నగర్: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..ఐ.ఎస్.సదన్ పీఎస్ పరిధిలోని డీఎస్‌నగర్‌కు చెందిన ఇ.అంజమ్మ (60) ఈనెల 8న ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన తల్లి కనిపించడం లేదని రమణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో అంజమ్మ ఇదే మాదిరిగా ఇంట్లో నుంచి బయటికి వెళ్లి రోడ్డుపై డబ్బులు సేకరించి మద్యం సేవించేదని..అనంతరం తిరిగి వచ్చేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న సంఘం ప్రతినిధులు, భక్తులు

గౌలిపురా: అమావాస్యను పురస్కరించుకొని ఆర్య వైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో గౌలిపురా బతుకమ్మ బావి సమీపంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ ముందు ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు చీల రాములు గుప్తా, విశ్వేశ్వరయ్య గుప్తా, అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్, కోశాధికారి కొల్కూరి నర్సింహులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతి, సభ్యులు గుబ్బ శ్రీనివాస్, ముక్క శేఖర్, బెజగం శిరంగి, సంతోష్, వెంకటేశం పాల్గొన్నారు.

వేగవంతంగా అభయ హస్తం దరఖాస్తుల నమోదు



అలీ మస్కతి

చార్మినార్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి అన్నారు. ఇటీవల ముగిసిన ప్రజా పాలన కార్యక్రమంపై గురువారం కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన కోట్ల అలీజాలోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రజా పాలన సందర్భంగా అందిన అభయ హస్తం దరఖాస్తుల నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందన్నారు. డాటా ఎంట్రీ పూర్తి కాగానే అర్హులైన దరఖాస్తుదారులందరికీ ఆరు గ్యారంటీల అమలు కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు.

'రామ్‌లాలా ప్రాణ్-ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం'



సందీప్‌కుమార్

అబిడ్స్: సీతారామ్‌బాగ్‌లోని సీతారామ్‌బాగ్ ఆలయంలో రామ్‌లాలా ప్రాణ్-ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలంగాణ ఆలయ రక్షణ సమితి అధ్యక్షుడు సందీప్‌కుమార్ తెలిపారు. ఈనెల 22న అయోధ్య రామ మందిర్ ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం సీతారామ్‌బాగ్ ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేస్తున్నామన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..కమలేష్ ఆచార్య జీ మహంత్, ఆచార్య గంగోత్రి రామానుజ దాస్‌జీ, వైష్ణవ గంగోత్రి మఠం, గంగోత్రి ధామ్ ఆధ్యాత్మిక గురువులచే ఈ పూజా వేడుకలు చేపడుతామన్నారు. సీతారామ్‌బాగ్‌లో సాయంత్రం 5 గంటలకు దీపోత్సవం నిర్వహిస్తామన్నారు.

22న ఇంటింటా అయోధ్య సంబరాలు



అక్షింతలను పంపిణీ చేస్తున్న ఆనంద్ మరిపల్లి తదితరులు

అబిడ్స్: ఈ నెల 22న అయోధ్య సంబరాలు నిర్వహిస్తామని గ్రేటర్ హైదరాబాద్ ఆర్ఎస్ఎస్ నాయకులు ఆనంద్ మరిపల్లి పేర్కొన్నారు. ఇషాక్ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. అనంతరం ఆనంద్ మరిపల్లి మాట్లాడుతూ..500 ఏళ్ల తర్వాత ప్రారంభమవుతున్న అయోధ్య ఆలయం వేడుకలు విశ్వవ్యాప్తంగా అంబరాన్ని చాటుతామన్నారు. ప్రతి ఇంటా ఐదు దీపాలు వెలిగించి దీపావళి శోభను తలపించే విధంగా వేడుకలు నిర్వహిస్తామన్నారు.

రోగులకు అల్పాహారం పంపిణీ



కోఠి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో అల్పాహారం పంపిణీ చేస్తున్న బజరంగ్ సేనా నాయకులు

సుల్తాన్‌బజార్: బజరంగ్‌సేనా ధర్మ కార్యాలతో పాటు సామాజిక సేవలో ముందుంటుందని ఆ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. అమావాస్యను పురస్కరించుకుని కోఠి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోగులకు, వారి సహాయకులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదలకు తమ సంస్థ చేయూతనందిస్తుందన్నారు. ఆస్పత్రులలో పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌సేనా ప్రతినిధులు రజిని, మనోజ్, ఖాజల్, సునీల్ అగర్వాల్, రాఘవ, శ్రీనివాస్‌రావు, అక్షిత్ అగర్వాల్, నరేష్, మధు చౌదరి, రితేష్ పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ అథారిటీ స్టాల్ ప్రారంభం



గన్‌ఫౌండ్రీ: లీగల్ సర్వీసెస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోషి అన్నారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న 83వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సామాన్య ప్రజలు తమకు అందేటటువంటి న్యాయ సేవల గురించి అడిగి తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, ఏఓ జి.కళారచన తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంత్యక్రియలు



శ్రద్ధాంజలి ఘటిస్తున్న గాజుల అంజయ్య, మధుసూదన్ యాదవ్

చార్మినార్: అశ్రు నయనాల మధ్య దమయంతి తివారి అంత్యక్రియలు గురువారం పురానాపూల్ హిందూ శ్మశాన వాటికలో ముగిశాయి. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ రాకేశ్ తివారి మాతృమూర్తి అయిన దమయంతి తివారి అనారోగ్యం కారణంగా బుధవారం సుల్తాన్‌షాహీలోని తన స్వగృహంలో మృతి చెందిన ఆమె అంత్యక్రియలలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో పాటు పలువురు అధికార అనధికార ప్రముఖులు పాల్గొని నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.